తెలంగాణ సోయి లేనోడు సీఎం

- ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ప్రజలు ఊరుకోరు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఆత్మ లేదు.. తెలంగాణపై గౌరవం అంత కన్నా లేదు అని నిప్పులు చెరిగారు. తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ అని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెలవనోడు సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యం అని విమర్శించారు. నా తెలంగాణ దేనినైనా సహిస్తుంది కానీ.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోదు అని తేల్చిచెప్పారు. నిన్నమొన్నటి దాకా గుజరాత్ మాడల్‌పై నిప్పులు చెరిగిన రేవంత్.. ఇవాళ ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే.. ఆయన గురించి గొప్పలు మాట్లాడుతున్నారని, ఇదేం నీతి.. ఇదేం రీతి.. రేవంత్ అంటూ ట్వీట్‌లో దుయ్యబట్టారు. కేటీఆర్ చేసిన ట్వీట్ ఇదే..

రేవంత్‌కు తెలంగాణ 'ఆత్మ' లేదు.
తెలంగాణపై 'గౌరవం' అంతకన్నా లేదు.
అందుకే తెలంగాణ 'ఆత్మగౌరవం'పై
మోదీ సాక్షిగా రేవంత్ దాడి
అసలు తెలంగాణ సోయి లేనోడు..
సీఎం కావడం మన ఖర్మ!
తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెల్వనోడు..
ముఖ్యమంత్రిగా ఉండటం మన దౌర్భాగ్యం!
అసలు 'గోల్‌మాల్ గుజరాత్ మాడల్'కు..
'Golden తెలంగాణ మాడల్'తో పోలికెక్కడిది?
ఘనమైన 'గంగాజమున తెహజీబ్ మాడల్' కన్నా..
మతం పేరిట చిచ్చుపెట్టే 'గోద్రా అల్లర్ల మాడల్' నీకు
నచ్చిందా?
నిన్నటిదాకా..
గుజరాత్ మాడల్‌పై.. నిప్పులు!
ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే.. గొప్పలా?
ఇదేం నీతి..? ఇదేం రీతి..?
తెలంగాణ మాడల్ అంటే..
సమున్నత సంక్షేమ నమూనా
సమగ్రాభివృద్ధికి చిరునామా
అనేక రాష్ట్రాలు మెచ్చిన మాడల్..
యావత్తు దేశానికే నచ్చిన మాడల్..
బుడిబుడి అడుగుల వయసులో
బుల్లెటు వేగంతో దూసుకెళ్లిన
సమగ్ర, సమ్మిళిత, సమీకృత మాడల్!
దేశం మెచ్చిన ఈ తెలంగాణ నమూనాను
నమో ముందు కించపరుస్తావా..?
నమ్మి ఓటేసిన తెలంగాణపై
ఎందుకీ నయవంచన?
నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని
మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెడతావా?
నాడు తెలంగాణ ఉద్యమకారులపై రైఫిల్ ఎత్తావ్
నేడు తెలంగాణ ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టావ్
నిన్ను చరిత్ర క్షమించదు
నా తెలంగాణ దేనినైనా సహిస్తుంది కానీ..
ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తే మాత్రం ఊరుకోదు.
తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని
ఆకాశమంత ఎత్తుకు ఎత్తింది.. బీఆర్ఎస్!
నేడు పాతాళంలో పాతిపెట్టేస్తున్నది.. కాంగ్రెస్!!

బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఎల్ఆర్ఎస్‌పై జనాగ్రహం

ప్రభుత్వ వైఖరిపై నిరసనల వెల్లువ

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు
ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ర్యాలీలు
ఉచితంగా అమలు చేయాలని డిమాండ్

నమస్తే నెట్ వర్క్, మార్చి 6: ఎల్ఆర్ఎస్‌పై ఫీజు వసూలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం బీఆర్ఎస్ పోరు బాటపట్టింది. పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలతో నగరాలు, పట్టణాలు దద్దరిల్లాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. రామగుండం నగరంతోపాటు సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, పెద్దపల్లి, మంథని, చొప్పదండి పట్టణాలు, మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, జహీరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, వర్ధన్నపేటలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, వరంగల్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ పట్టణంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్, ఖానాపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్, నిర్మల్ జిల్లా కేంద్రంలో, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ముందు బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, చెన్నూర్‌లో మున్సిపల్ చైర్మన్ అర్పన గిల్డా ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు కొనసాగాయి.

నినాదాల హోరు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి నియోజకవర్గ కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. కొడంగల్, షాద్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, కల్వకుర్తి, కొల్లాపూర్, వనపర్తిలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపారు. కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో నిరసన కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, దేవరకొండలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మునుగోడులో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, సూర్యాపేటలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఆలేరులో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, భువనగిరిలో కంచర్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు, ధర్నాలు కొనసాగాయి. ఆయా చోట్ల ర్యాలీల్లో నినాదాలు హోరెత్తాయి.

కామారెడ్డిలో ధర్నా చేస్తున్న మాజీ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ నేతలు

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తదితరులు



జనగామ ఆర్టీసీ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నాలో ప్లకార్డును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

నిజామాబాద్ జిల్లా బాల్కొండలో తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై బైఠాయించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు



కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని పల్లెమీద చౌరస్తా వద్ద ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ నాయకులు



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

గొర్రెలిస్తారా? డబ్బులిస్తారా?

- గొర్రెల పథకం డీడీలపై సర్కారు నాన్చుడు
- సమీక్షలో స్పష్టతనివ్వని సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : గొర్రెల పంపిణీ పథకంపై కక్ష సాధింపు కోసం తహతహలాడుతున్న ప్రభుత్వం... డీడీలు చెల్లించిన వారికి లబ్ధి చేకూర్చే అంశంపై మాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం గొర్రెల పంపిణీ పథకంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. అయితే ఇప్పటికే పథకంలో భాగంగా తమ వాటా సొమ్మును డీడీల రూపంలో చెల్లించిన లబ్ధిదారుల సమస్యను మాత్రం పట్టించుకోలేదు. ఈ సమస్యను అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయన స్పందించలేదని తెలిసింది. దీంతో డీడీలు చెల్లించిన సుమారు 85 వేల మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఒక్కో యూనిట్‌కు 21 గొర్రెలు

కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన వారికి ఒక్కో యూనిట్ (21 గొర్రెలు) సబ్సిడీలో అందించారు. ఒక్కో యూనిట్‌కు ధర రూ. 1.75 లక్షలు కాగా, ప్రభుత్వ వాటా రూ. 1,31,250 కాగా లబ్ధిదారుల వాటా రూ. 43,750గా నిర్ణయించింది. ఈ పథకానికి సుమారు 1.17 లక్షల మంది తమ వాటా కింద ఒక్కొక్కరు రూ. 43750 డీడీల రూపంలో చెల్లించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల సమయానికి సుమారు 32వేల మందికి ఒక్కో యూనిట్ (21 గొర్రెలు) పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇంకా సుమారు 85వేల మందికి గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉన్నది.

బ్యాంకుల్లో 372 కోట్లు

85 వేల లబ్ధిదారులు ఒక్కొక్కరు తమ వాటాగా చెల్లించిన రూ. 43750 సొమ్ము మొత్తం సుమారు రూ. 372 కోట్లు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. ఒకవేళ ప్రభుత్వం డీడీలు చెల్లించిన వారికి గొర్రెలను పంపిణీ చేయాలనుకుంటే సుమారు రూ. 1115 కోట్లు వెచ్చిస్తే సరిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వీలైతే గొర్రెలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో తమ వాటా సొమ్మును తిరిగి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రతిరోజు కలెక్టరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయింది.

ఆయిల్‌పామ్ రైతులకు కేంద్రం ధోకా

- కనీస ధర నిర్ణయించడంలో మెలిక
- తెరపైకి కొత్త విధానం తెచ్చే ప్రణాళిక
- ఐదేళ్ల సగటు ఆధారంగా మద్దతు ధర
- పామాయిల్ దిగుమతులపై సుంకం ఎత్తివేత

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ రైతులకు కేంద్రం ధోకా ఇచ్చింది. ఆయిల్‌పామ్ గెలలకు కనీస ధర నిర్ణయించడంలో మెలిక పెట్టి రైతులకు నష్టం కలిగిస్తున్నది. కనీస ధరకు కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పేరిట కొత్త సూత్రాన్ని తెరపైకి తీసుకొచ్చింది. దీని వల్ల రైతులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సూత్రం అమలు చేస్తే రైతులు ప్రస్తుతం అందుతున్న ధరలో మూడు శాతం నష్టపోవాల్సి వస్తుంది. దీంతోపాటు కనీస ధర నిర్ణయానికి గడిచిన ఐదేండ్ల సగటును తీసుకోవాలన్న కేంద్రం నిర్ణయంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం షరతుల నేపథ్యంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌కు సంబంధించి కేంద్రంతో ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం దూరంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లుగా 22శాతం ఓఈఆర్‌ను లెక్కించాలని, ఐదేళ్ల సగటును తీసేయాలని కేంద్రాన్ని కోరింది. ఆ నిబంధనలు తీసేస్తే ఒప్పందంలో చేరేందుకు ఆలోచిస్తామని లేఖ రాసింది.

22శాతం నుంచి 19శాతానికి తగ్గింపు

గింజల నుంచి వచ్చే నూనె శాతం(ఓఈఆర్) ఆధారంగా పామాయిల్ గెలల ధరలను నిర్ణయిస్తారు. ప్రస్తుతం తెలంగాణలో ఓఈఆర్‌ను 22శాతంగా లెక్కించి టన్నుకు రూ.13వేల వరకు రైతులకు చెల్లిస్తున్నారు. రైతులకు నష్టం లేకుండా ఆయిల్‌తోపాటు గింజలను కూడా కలుపుతున్నారు. కానీ కేంద్రం ఓఈఆర్‌ను 19శాతంగా లెక్కించి కనీస ధరను నిర్ణయించాలని భావిస్తున్నది. ఇందులో కూడా కేవలం ఆయిల్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ గింజల ధరను లెక్కించడం లేదు. వాస్తవానికి గింజల ద్వారా వచ్చే నూనెకు అధిక ధర ఉంటుంది. ఈ ప్రకారం రైతులు మూడు శాతం ధరను నష్టపోవాల్సి వస్తుంది. అంటే రైతులు టన్నుకు సుమారు రూ. 2వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని అధికారులు చెప్తున్నారు.

దిగుమతి సుంకాన్ని ఎత్తేసిన కేంద్రం

విదేశాల నుంచి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని కేంద్రం పూర్తిగా ఎత్తివేసింది. దీంతో దేశంలో ఆయిల్‌పామ్ ధరలు పడిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే ఆయిల్‌పామ్ రైతులకు నష్టం వాటిల్లుతుంది.కేంద్రం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఐదేండ్ల సగటు ఆధారంగా కనీస ధర నిర్ణయం...

2020 నుంచి 2022 వరకు పలు కారణాలతో ఆయిల్‌పామ్ గెలల ధర ఎప్పుడూ లేనంత అధికంగా పలికింది. దీంతో గడిచిన ఐదేండ్ల సగటు తీసుకుంటే కనీస ధర ఎక్కువగానే వస్తుంది. కానీ రానున్న కాలంలో ధరలు తగ్గితే రైతులకు భారీ నష్టం జరుగుతుంది. కేంద్రం మరో షరతు కూడా పెట్టినట్టు తెలిసింది. మార్కెట్ ధర కనీస ధర కన్నా తక్కువగా ఉంటే మొదటి ఏడాది ఆ వ్యత్యాసం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చెల్లించాలి. ఆ తరువాత ఏడాదికేడాది కేంద్రం తన వాటాను తగ్గిస్తూ పోతుంది. ఈ విధంగా 2037 నాటికి కేంద్రం చెల్లించాల్సిన వాటాను పూర్తిగా ఉపసంహరించుకుంటుంది. ఈ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కంపెనీలు మోయాల్సి వస్తుంది.

పీఆర్సీ సిఫారసులు ఎప్పుడు?

- సమీపిస్తున్న కమిటీ గడువు
- మిగిలింది మరో 26 రోజులే
- ముంచుకొస్తున్న పార్లమెంట్ ఎన్నికలు
- కమిటీ గడువు పొడగించక తప్పదా?

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వేతన సవరణకు నియమించిన పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) గడువు సమీపిస్తున్నది. ఈ కమిషన్‌ను నియమించి ఇప్పటికే ఐదు నెలలు పూర్తికాగా కమిటీ సభ్యులు ఇంకా ఆయా ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించడంలోనే మునిగి ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం కమిషన్ గడువు మరో 26 రోజుల్లో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో సమగ్ర నివేదికను సిద్ధం చేసి, ప్రభుత్వానికి సమర్పించడం అనుమానంగానే కనిపిస్తున్నది. రాష్ట్రంలో ఉద్యోగుల వేతన సవరణ కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ శివశంకర్ చైర్మన్‌గా రెండో పీఆర్సీని నియమించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 2న కమిషన్‌ను నియమిస్తూ ఉత్తర్వులిచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఆరు మాసాల్లో నివేదికనివ్వాలని సూచించింది. ఈ కమిటీ గడువు ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది.

కొనసాగుతున్న స్వీకరణ..

పీఆర్సీ కమిటీని నియమించిన వెంటనే అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. దీంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పీఆర్సీ తన పనిని ప్రారంభించింది. ఫిబ్రవరి రెండో తేదీ నుంచి ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించడం ప్రారంభించింది. ఈ గడువు మార్చి నాలుగుతో ముగిసింది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలన్నీ తమ ప్రతిపాదనలను కమిటీ ముందుంచాయి. కొన్ని ఉద్యోగ సంఘాల వినతులు మేరకు మరో వారం రోజుల పాటు ప్రతిపాదనల స్వీకరణ గడువును పీఆర్సీ కమిటీ పొడగించింది. ఏదీ ఏమైనా ఏప్రిల్ రెండు లోపు సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం సాధ్యమయ్యేలా లేదు. మరోవైపు ఈ నెలలోనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. మే వరకు ఎన్నికలతోనే గడిచిపోనుంది. అంటే పీఆర్సీ ప్రకటనకు బ్రేకుల మీద బ్రేకులు పడుతున్నాయి. తాజా అంచనాల ప్రకారం పీఆర్సీ కమిటీ గడువును మరి కొద్దిరోజుల పాటు పొడగించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.